క్లుప్తంగా

తహసీల్దార్ల నియామకం

భూపాలపల్లి: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లను వివిధ మండలాలకు నియమిస్తూ బుధవారం కలెక్టర్ భవేష్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వచ్చిన ఆర్ ప్రహలాద్‌ను చిట్యాల మండల తహసీల్దార్‌గా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వచ్చిన ఎల్ వీరభద్రంను కొత్తపల్లిగోరి మండల తహసీల్దారుగా, జగిత్యాల జిల్లా నుంచి వచ్చిన కె విజయలక్ష్మిని టేకుమట్ల మండల తహసీల్దారుగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వచ్చిన హెచ్ రంగాను ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా, కొత్తపల్లి గోరి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె రవికుమార్‌ను మల్హర్ మండల తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు బ్యాంక్ ప్రారంభం

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖను నేడు(గురువారం) ప్రారంభించనున్నట్లు మొట్లపల్లి శాఖ మేనేజర్ దిలీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ వై.శోభ, ప్రాంతీయ మేనేజర్ ధముక ప్రభుదాస్, ఎస్ఎంఓ వేమూరి సాయి కృష్ణ, ఎస్ఎంబీబీ.పీ. రాజు హాజరు కానున్నట్లు తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండల పంచాయతీ కార్యదర్శుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ గౌరవ అధ్యక్షుడు పి.లింగయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా దేవేందర్, ఉపాధ్యక్షురాలుగా కల్పన, ప్రధాన కార్యదర్శిగా సదానందం, కోశాధికారిగా నరేష్, సలహాదారులుగా స్వప్న, రాము, కార్యవర్గ సభ్యులుగా శ్రీదేవి, రామకృష్ణ, శశికాంత్, ఓంకార్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

భర్త ఇంటి ఎదుట నిరసన

భూపాలపల్లి అర్బన్: తనను కాపురానికి తీసుకురావడం లేదని ఆరోపిస్తూ భర్త ఇంటి ఎదుట భార్య నిరసన వ్యక్తం చేసిన సంఘటన జిల్లా కేంద్రంలో మంజూర్‌నగర్‌లోని బీసీ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు లక్ష్మీప్రసన్న తెలిపిన వివరాల ప్రకారం... బీసీ కాలనీకి చెందిన పెండ్యాల నరేష్‌కుమార్ ములుగు జిల్లాలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ తనను 4 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నట్లు తెలిపింది. గతంలో ఒకరితో వివాహం చేసుకొని విడాకులిచ్చి తనను వివాహం చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు ఆదే విధంగా ప్రవర్తిస్తూ గత రెండు సంవత్సరాలు కాపురానికి తీసుకుపోవడం లేదని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందిస్తే విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించి వెళ్లిపోయారు.

కారును ఢీ కొట్టిన టిప్పర్



కాటారం: మండలంలోని మేడిపల్లి టోల్‌గేట్ సమీపంలో ఆగిఉన్న కారును బొగ్గు లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఢీ కొట్టిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్తే మేడారం నుంచి నలుగురు కారులో హనుమకొండ వైపుగా వెళ్తూ టోల్‌గేట్ సమీపంలో రోడ్డుపక్కన కారు నిలిపారు. ఇదే క్రమంలో కాటారం వైపు నుంచి బొగ్గు లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఆకస్మాత్తుగా కారును వెనక నుంచి ఢీ కొట్టడంతో కారు ముందు ఆగివున్న మరో లారీని ఢీ కొట్టింది. దీంతో కారు ముందు వెనుక భాగం నుజ్జు నుజ్జు కావడంతో పాటు కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలపాలయ్యారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి టిప్పర్, కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని శివతండా గ్రామానికి చెందిన బానోత్ భారతమ్మ విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ బుధవారం పరామర్శించి ములుగు ఏరియా ఆస్పత్రిలో భారతమ్మ మృతదేహం దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, భిక్షపతి, ఎల్లావుల అశోక్, అఫ్సర్, షకిత్, జాఫర్, సాంబయ్య, సర్వర్‌పాషా, భాస్కర్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి

మంగపేట: మండలంలోని రాజుపేటలోని ప్రధాన సెంటర్ ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు రాజేపేట జెడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఉగ్రమూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీరజవానుల ఆత్మకు శాంతి కలుగాలని కోరుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పుల్వామా సంఘటన జరిగి నేటికి ఐదేళ్లు అయిందని 2019 ఫిబ్రవరి 14న పుల్వామా పట్టణం సమీపంలో భారత సైనికుల వాహన కాన్వాయ్‌పై ఉగ్రమూక కారుతో ఆత్మాహుతి బాంబుదాడి జరిపిందన్నారు. దాడిలో 40 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) సైనికులు మృతి చెందినట్లు తెలిపారు. ఈ రోజు ప్రతిఏటా భారత ప్రజలు బ్లాక్‌డేగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాలు వీరనారాయణ, పావని, అనుమపావని, జమున, సుజాత, ఆస్మాబేగం, మహాదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



రాజుపేట ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

అమరుల త్యాగాన్ని మర్చి పోలేం..

పుల్వామా అమరుల త్యాగాన్ని మర్చి పోలేమని భారతదేశ చరిత్రలో ఫిబ్రవరి 14 ఇదో చీకటి రోజు అని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ అన్నారు. మండల కేంద్రంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుల్వామా సంఘటనలో అమరులైన 40 మంది అమరజవానుకు ఘనంగా నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిసాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. పుల్వామాలో ముష్కరుల దాడిలో అమరులైన జవాన్ల త్యాగాలను దేశం ఎప్పటికి మర్చిపోదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రాకేష్, సతీష్, రోహిత్, ఇంతియాజ్, విష్ణువర్ధన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మంగపేటలో నివాళులర్పిస్తున్న ట్రస్టు సభ్యులు

సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

ములుగు రూరల్: యాసంగి వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి మునుకుంట్ల సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని బండారుపల్లి, ములుగు శివారులో వరి సాగు క్షేత్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సాగులో కాండం తొలుచు పురుగు ఉధృత్తి ఎక్కువగా ఉన్నట్లు గమనించామని అన్నారు. నివారణ చర్యలుగా నారుమడిలో కార్బోహైడ్రేట్ గుళికలు వేసుకోవాలని అన్నారు. నారుమడి దశలో వేయలేని రైతులు వరి నాటు అయిన 15 రోజులకు రెండవ దశ ఎరువు వేసే క్రమంలో గుళికలు తప్పని సరిగా కలుపుకోవాలని అన్నారు. వరి పొట్ట దశలో రెక్కల పురుగు నివారణకు కార్బాన్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ ఎకరాకు 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తర్ణ అధికారులు దిలీప్, రైతులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఏఓ సంతోష్

బస్టాప్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మంగపేట: మండల కేంద్రం నుంచి మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు తాత్కాలిక బస్టాప్ ఏర్పాటుకోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ అధికారులు స్థానిక తహసీల్దార్ వీరస్వామి కలిసి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈనెల 18 నుంచి మేడారం మహాజాతర ముగిసే వరకు బస్సులను నడిపేందుకు మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద తాత్కాలిక బస్‌స్టాప్ ఏర్పాటు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగుకుండా కల్పించాల్సిన సౌకర్యాలపై, తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు పలు సూచనలు చేశారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఏఓ చేరాలు, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

మంగపేట: అడవి జంతువులు, వన్యప్రాణులను వేటాడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై గోదారి రవికుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని అటవీశాఖ రేంజ్ అధికారి షఫీల్‌పాషా అధ్యక్షతన రేంజ్ కార్యాలయంలో పోలీస్, అటవీశాఖ అధికారుల కోఆర్డినేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో కొందరు వ్యక్తులు అడవి జంతువులను వేటాడడం కోసం హైటెన్షన్ విద్యుత్ తీగలు, ఇనుప ఉచ్చులు అమర్చుతూ అడవిలో సంచరించే వన్య ప్రాణులు, మేతకు వెళ్తున్న ఆవులు, ఎద్దులు, గేదెల మృతికి కారకులవుతున్నారన్నారు. ఇలాంటి విషయంలో మండల పరిధిలో ఎవరైనా ఇలాంటి నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంగపేట రేంజ్ పరిధిలోని డిప్యూటీ రేంజ్ అధికారులు, ఆయా కంపార్టుమెంట్ల సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై రవికుమార్

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ములుగు రూరల్: గత సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని దేవగిరిపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ములుగు మండలంలో 2022–23 విద్యా సంవత్సరంలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.వేయి అందించారు. దీంతో పాటు దేవగిరిపట్నం ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే 11 మంది నిరుపేద విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్స్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా సర్వశిక్ష కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు చేయూతనందిస్తున్న డీఎస్ఆర్ ట్రస్టు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకుడు దొడ్డ ప్రతాప్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఏళ్ల మధుసూదన్, కందాల రామయ్య, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహాలను ప్రోత్సహిద్దాం..

కాటారం: కుల రహిత సమాజం ఏర్పడాలంటే కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ అన్నారు. ప్రేమికుల రోజును పురస్కరించుకొని కేవీపీఎస్ ఆధ్వర్యంలో కులాంతర వివాహాలు చేసుకున్న జంటలను బుధవారం మండల కేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు తొలిగిపోవాలంటే, కుల వివక్ష, అంటరానితనం ఉండకూడదు అంటే కులాంతర వివాహాలు చేసుకునే వారిని అభినందించాలని పేర్కొన్నారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకం అందించే విధంగా పోరాటం చేసిన ఘనత కేవీపీఎస్‌దే అని తెలిపారు. కులాంతర ప్రేమ వివాహలు చేసుకునే వారికి కేవీపీఎస్ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



జంటలను సన్మానిస్తున్న మహేందర్

భూనీలాసమేత చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కాటారం: మండలంలోని చింతకానిలో చెన్నకేశవ స్వామి ఆలయంలో వసంతపంచమిని పురస్కరించుకొని బుధవారం బనీలా సహమేత చెన్నకేశవ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. చింతకానితో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణం వీక్షించడానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు



ప్రత్యేక పూజలు చేస్తున్న చైర్మన్, కరస్పాండెంట్

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌లో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు వేద మంత్రోచ్చరణల మధ్య సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు జరిపించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కరస్పాండెంట్ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత, వేద పండితులు శివ పాల్గొన్నారు.

గుర్రంపేటలో మండమెలిగె పండుగ



మండమెలిగె నిర్వహిస్తున్న పుజారులు, సభ్యులు

భూపాలపల్లి రూరల్: మండలంలోని గుర్రంపేట గ్రామంలో మినీ మేడారం జాతరలో బుధవారం పూజారులు మండమెలిగె పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మ పూజారుల తో పాటు లక్ష్మీదేవరపూజారులు జాతర ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ సారంగపాణి మాట్లాడుతూ.. ఈ జాతరకు సుమారుగా 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తామన్నారు. మాజీ సర్పంచ్ సదయ్య, గ్రామ ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మహాముత్తారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రత్నం సుభద్ర అధ్యక్షతన నేడు (గురువారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని అధికారులు బుధవారం ఒక ప్రకటనలెట పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ ప్రత్యేకాధికారులు, మండల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలను పంపించాలి

చిట్యాల: మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల గల పిల్లలను స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని ఐసీడీఎస్ సీడీపీఓ అవంతి అన్నారు. బుధవారం మండలంలోని తిర్మలాపూర్ 1వ అంగన్‌వాడీ కేంద్రంలో వసంత పంచమి సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యసం, అన్నపాసన చేయించారు. అలాగే గర్భిణులకు సీమంత చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలను తల్లిదండ్రులు పంపించాలని కోరారు. . ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, టీచర్‌లు త్రివేణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ అవంతి

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

ఏటూరునాగారం: ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీకోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి బొడ్రాయి వరకు ప్లాస్టిక్ నిర్మూలించాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పలు కిరాణం, దుకాణాలకు వెళ్లి జూట్ బ్యాగులను అందజేస్తూ ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వల్ల భూమి, నీరు కలుషితం అవుతుందన్నారు. భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మనం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్‌తో మనుషుల ప్రాణాలకు ముప్పుపొంచి ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ దామోదరస్వామి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది రవీందర్, వెంకన్న, దయాకర్, లక్ష్మీనారాయణ, ప్రయణ్, మినాజ్, అనిల్, పెండ్యాల ప్రభాకర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నూగూరు, చొక్కాల, వెంకటాపురం సబ్ సెంటర్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్లలో చిన్నారులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. సెంటర్లలో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వాజేడు: జిల్లా స్థాయి ఇంగ్లీష్ డ్రామా పోటీల్లో మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి పొందారు. జిల్లాలోని 9 మండలాల నుంచి ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొనగా పెద్దగొల్లగూడెం ఆశ్రమ పాఠశాల నుంచి ఎట్టి బ్లెస్సీ, కొడిపె అమృత వర్షిణి, కాక రూపకళ, గొడ్డె దీప్తిక, కట్టం లక్ష్మి ప్రసన్న, లొట్టిపిట్టల శ్రీవిష్ణు పాల్గొని ప్రథమ బహుమతిని అందుకున్నారు. ప్రథమ స్థానం పొందిన విద్యార్థినులతో పాటు ప్రథమ స్థానం పొందటానికి కృషి చేసిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు బుచ్చి బాబును ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఘ్నేశ్వరరావు, తోటి ఉపాధ్యాయులు ప్రశంసించారు.



ప్రశంస పత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

కరెంటు ఉచ్చులు పెడితే చర్యలు



బైండోవర్ చేసిన అధికారులు

ఏటూరునాగారం: అడవుల్లో, పంట పొలాల్లో ఎక్కడైనా కరెంటు ఉచ్చులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నయాబ్ తహశీల్దార్ రాజేశ్వర్‌రావు వద్ద గతంలో వన్యప్రాణులకు కరెంటు ఉచ్చులు పెట్టిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిని బైండోవర్ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడవి జంతువులను వేటాడటానికి వేటగాళ్లు ఎవరైనా కరెంటు వైర్లు పెట్టినట్‌లెతై వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగ్తుతుందన్నారు. అలాగే ఎవరైతే గతంలో కరెంటు వైర్లు పెట్టిన వారిపై ఫారెస్టు, విద్యుత్‌శాఖ, పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. గతంలో వైర్ల పెట్టిన ఎద్దు జగదీష్, ఎద్దు కోటేష్, బొయిరి రవితే అనే వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అడవిలో కరెంటు ఉచ్చులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

ఏటూరునాగారం: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు ప్రైవేటు వాహనాలు, ఎడ్లబండ్లలో వచ్చే భక్తుల కోసం మండలంలోని ఎలిశెట్టిపల్లి–బన్నాజీబందం మధ్యలోని జంపన్నవాగుపై తాత్కాలికంగా రూ.12లక్షలతో పైపు కల్వర్టు నిర్మాణాన్ని ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా చేపడుతున్నారు. మేడారం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ పనులు పూర్తి అయ్యేవిధంగా ఇంజనీరింగ్‌శాఖ చర్యలు చేపట్టింది. ఒక మీటర్ ఎత్తుతో కూడిన 30 సిమెంట్ పైపులను నీటిమధ్యలో వేసి ఇసుకబస్తాలతో గైడింగ్‌వాల్ సపోర్ట్‌గా వేయనున్నారు. ఆ పైపులపై మట్టిని పోసి చదును చేయనున్నారు. అయితే అడవిమార్గం గుండా కొండాయి గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి కొండాయి కొత్తూరు నుంచి ఊరట్టం మీదుగా మేడారం చేరుకోవాల్సి ఉంది. గతంలో కొండాయి వద్ద అడవిలో ఉన్న ఒర్రెలో కల్వర్టును నిర్మించారు. కానీ ఈ సారి ఆ కల్వర్టు నిర్మాణం కోసం ఎలాంటి నిధులు వెచ్చించలేదు. కేవలం ఎలిశెట్టిపల్లి వద్ద ఉన్న కల్వర్టు నిర్మాణం పనులు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ పనులు జాతరలోపు అవుతాయా లేదా అనే అనుమానులు కలుగుతున్నాయి. పనులు పూర్తి చేసి భక్తులకు వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక లారీలతో నరకయాతన

మంగపేట: మండలంలో వందలాది ఇసుక లారీల రాకపోకలతో ఇతర వాహనదారులు స్థానిక ప్రజలు నరకయాతన అనుభవించాల్సిన దుస్థితి నెలకొంది. భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని సాంబాయిగూడెం గోదావరి ఇసుక క్వారీ నుంచి నిత్యం పగలు రాత్రి తేడా లేకుండా వందల సంఖ్యలో లారీలు వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు మండలం మీదుగా ఇసుక రవాణా చేస్తున్నాయి. ఇదే క్రమంలో మణుగూరు వైపు నుంచి మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే వెళ్లే భక్తుల వాహనాలతో పాటు సుదూర ప్రాతాలకు అనునిత్యం వెళ్లి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటోంది. దీంతో అడుగడుగున ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో మేడారం భక్తులు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందుకు గురవుతున్నారు. ఇసుకలారీ కారణంగా బుధవారం రాత్రి మంగపేట కమలాపురం మధ్య, బ్రాహ్మణపల్లి చెక్‌పోస్టు వద్ద గంట పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, మేడారం భక్తులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి మేడారం జాతర ముగిసే వరకు ఇసుక లారీల రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలని మేడారం భక్తులు, మండల ప్రజలు కోరుతున్నారు.



బ్రాహ్మణపల్లి చెక్‌పోస్టు వద్ద నిలిచిన వాహనాలు